# "విద్యా వివాహ నాశాయయా...?"

"పదహారో శతాబ్దపు కవుల చరిత్ర అంటే ఎవరిని గురించి రాయాలి?"

మెల్లగా సణుగుతూ అడుగుతోంది నా వెనుక సీటులోని అమ్మాయి. అప్పుడే మూడోమాటు ఈ ప్రశ్నఅడగటం. తల ఎత్తి మెల్లగా ఇటూ అటూ చూసేను.

వాచర్లు ఇద్దరూ పరీక్షా హాలు బయటనిలబడి మాట్లాడుకుంటున్నారు. నేను రాసిన సమాధానం పేజీ ఆమెకు కనిపించేలా ప్రక్కకుపెట్టి, చూసి రాసుకొమ్మన్నట్లు సంజ్ఞ చేశాను. వెనుకనున్న అమ్మాయి నేనురాసిన కాగితాలవంక చూస్తూ, కాపీ చేయటం ప్రారంభించింది. నేను చేస్తున్న పని తప్పు అనినాకుతెలుసు. కానీ, ఆమెకు ఎలా చెప్పటం?

నేను రాస్తున్నది బియ్యే మొదటి సంవత్సరం పరీక్షలు. నేను ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నది కెమికల్ ఫేక్టరీలో అయినా, సాహిత్యం మీద వుండే అభిలాషకొద్దీ తెలుగు మెయిన్ సబ్జెక్టుగా బియ్యే చదవడం ఆరంభించేను. ఇంజనీరింగ్ పరీక్షలు వ్రాసి ఎనిమిదేళ్ళ సర్వీసు పూర్తి చేశాక, మళ్ళీ పరీక్షలు రాయటం. సమాధానాలు తెలిసినవే అయినా తెలుగు వ్రాయటంలో అలవాటు తగ్గి వేగంగా రాయలేకపోతున్నాను. దీనికితోడు వెనుకసీటులోని అమ్మాయి ప్రశ్నలు, సణుగుడు కూడా నాకు ఇబ్బందిగా తయారయ్యాయి. హాలు బయటకు వచ్చాక, రేపటి నుండీ నన్ను డిస్టర్బ్ చేయవద్దని గట్టిగా చెప్పాలనుకున్నాను.

ఆఖరి బెల్ అయిపోయింది. సమాధానాల కాగితాలు వాచర్లు సేకరిస్తున్నారు. నా కాగితాలు ఇచ్చేసి పరీక్షా హాలులోంచి బయటకు వచ్చి వరండా మెట్లు దిగేను.

నా వెనుక సీటులో కూర్చున్న అమ్మాయి అంతలోనే బయటకు వచ్చి నాకు దగ్గరగా వచ్చింది. చిరునవ్వు చిందిస్తూ "థేంక్సండీ" మీరు ఆ ప్రశ్నకు సమాధానం చూపించకపోతే అనవసరంగా ఇరవైమార్కుల పెద్ద ప్రశ్న వదిలెయ్యవలసి వచ్చేది" అంది.

రెండు నిమిషాలబాటు సమాధానం చెప్పకుండా ఆమె వంక చూస్తూ వుండిపోయాను. నేను ఆమెకు గట్టిగా చెప్పాలనుకున్న సలహా నా పెదాలకిందే వుండిపోయింది.

"ఫరవాలేదు లెండి" అన్నాను.

"మీరు ప్రయివేటుగానే చదువుతున్నారా?" "అవునన్నట్లుగా' తలవూపేను.

"మీరు క్రిస్టియన్ హైస్కూలు రోడ్డులో వుంటున్నారుకదా" మళ్ళీ అడిగింది.

"అక్కడ ఎప్పుడయినా నన్నుచూసేరా?" అడిగేను.

"చూసినట్లు జ్ఞాపకం" అంది.

"మనిషిని పోలిన మనిషి వుండటానికి సావకాశాలున్నాయి. మీరు చెప్పిన ఏరియాతో నాకు పరిచయంలేదు. నేనువుండేది లలితానగరంలో! పనిచేస్తున్నది కెమికల్ ప్లాంటులో. చదువంటారా! తెలుగుమీద వుండే మమకారంకొద్దీ తెలుగుబియ్యేకి కట్టేను. అంతే" అన్నాను.

"మిమ్మల్ని చూసి కాలేజీ స్టూడెంటు అనుకున్నాను. ఉద్యోగస్థుడనుకోలేదు"

"థేంక్యూ ఫర్ ది కాంప్లిమెంట్" అన్నానునవ్వుతూ

"థేంక్స్ ఎందుకు? ఉద్యోగస్తులుగా గుర్తింపబడటంకంటే విద్యార్థిగా గుర్తింపబడటమే మీకు ఇష్టమా?" అంటూ అడిగింది.

"గడిచిపోయిన రోజులు తిరిగిరావు కదా. అందుకే అది కాంప్లిమెంటుగా తీసుకున్నాను." అన్నాను.

"రేపు కూడా మీరు నాకు సహాయం చెయ్యాలి" అంది తలదించుకుని మెల్లగా కాలి బొటనవేలితో నేలమీదరాస్తూ.

"అలాగేలెండి" అన్నాను. ఎందుకో కుదరదని చెప్పలేకపోయాను.

"వెళ్ళొస్తానండీ నాపేరు కృష్ణసుందరి, మీపేరు కృష్ణమూర్తి అని తెలుసు బై" అంటూ వెళ్ళిపోయింది.

ఆమెకు నా పేరుఎలా తెలిసిందో ఊహించడం పెద్ద కష్టమయిన పనికాదు. పరీక్ష రాసేటపుడు నా సీటు మీద అంటించిన పేరు, నెంబరు చూసి వుండాలి బయటకు వచ్చి స్కూటర్ స్టార్ట్ చేశాను.

పరీక్షల అయిదురోజుల్లోనూ కృష్ణసుందరితో నా పరిచయం పెరిగింది. సుందరి సన్నగా, నాజూకుగా వుంటుంది. చకచకా కళ్ళు తిప్పుతూ మాట్లాడుతుంది. నల్లని నిడువయిన కురుల్ని అందంగా రెండుపాయలుచేసి రెండు జడలు వేసుకుంటుంది. యవ్వనానికి కాపలా వేసుకుంటున్నట్లుగా అందులోని ఒక జడను వెనక్కి మరొకదాన్ని ముందుకు పడేసుకుంటుంది. కృష్ణసుందరి అందంలో ప్రత్యేక ఆకర్షణ అంటూఏమీలేదు. విడిగా కళ్ళు, ముక్కు, పెదాలు ఊహించుకుని ఆలోచిస్తే వాటికి ఒక క్రమమయిన అందమైన ఆకృతి కనిపించదు. అయితే మాట్లాడేటపుడు కళ్ళు చక్రాల్లా తిప్పుతూ అభినయించటంలోనే ఆమె అందమంతావుంది.

"పియూసీ ప్యాసయిహాయిగా ఇంట్లో కూర్చుంటే ఊరుకోక మా నాన్న ఈ చదువు పోరు ప్రారంభించేరు. ఇరవై యేళ్ళు దాటిపోతూ వుంటే ఇంకా బియ్యే పరీక్షలు రాయటమేమిటి? అంది రెండో రోజు పరీక్ష అయిపోయాక.

"చదువుకి వయస్సేమిటి? యాభయ్యోయేట బియ్యేచదివిన వాళ్ళనీ నాకు

తెలుసు. ఆమాటకొస్తే నాకు ముప్ఫయ్యేళ్ళులేవూ?" అన్నాను.

"చదువుకి వయసుతో సంబంధం లేకపోవచ్చుగానీ, ఈ చదువకీ, విజ్ఞానానికి డిగ్రీలు ఏమాత్రం కొలబద్దలు కావు" అంది.

"ఆఫ్‌కోర్స్, అది నిజమే" అన్నాను ఏమనాలో తోచక.

"మా బావ ఈ సంగతి ఒప్పుకోదు ఏం చేయటం?" అంటూ గొణుక్కుంది. ఆ బావ ఎవరో, అతడు ఒప్పుకోని సంగతేమిటో నేను వివరంగా అడగలేదు.

ఆఖరు పరీక్ష వ్రాసి బయటకు వచ్చేక "కాఫీ తాగుదామా?" అని అడిగేను ఆమె అంగీకారంగా తలవూపింది. కాలేజీ కేంటీనులో కూర్చుని కాఫీ తాగుతూ ఆవేళ్టి పేపరులోని ప్రశ్నల గురించి మాట్లాడుకుంటున్నాం. ఆమె అడిగింది "మీకు పెళ్ళయిందా?"

"ఆహా లక్షణంగా, ముగ్గురు పిల్లలుకూడాను" అన్నాను.

"అయితే మీ భార్య అదృష్టవంతురాలు"

"నా భార్య అదృష్టవంతురాలని సర్టిఫికేటు ఇచ్చేస్తున్నారు. నాగురించి మీకేం తెలుసు?" నవ్వుతూ అడిగేను.

"మిమ్మల్ని బట్టి మీ భార్య గురించి అలా మాట్లాడటం లేదు"

"మరి?"

"ఈ దేశంలో పెళ్ళయిపోయిన ప్రతి ఆడదీ అదృష్టవంతురాలే"

"ఆడదానికి పెళ్ళి అంత సమస్యగా తయారయిందంటారా?" అడిగేను.

"నా విషయంలో మటుకు అంతే" అంది.

"ఎందుకని?"

" మా బావతో నా వివాహం ఎప్పుడో నిశ్చయమయిపోయింది. కానీ నేను డిగ్రీ ప్యాసయితే కాని నన్ను పెళ్ళిచేసుకోనన్నాడు. అలా చదువుకీ పెళ్ళికీ ముడి పెట్టాడు. నాకీ చదువు మీద ఆసక్తిలేదు. క్లాసు పుస్తకాలు తప్ప ఏ పుస్తకాలయినా ఇష్టంగా చదువుతాను. అడవిబాపిరాజు, విశ్వనాథ, బుచ్చిబాబు, శరత్ వరకూ అందరి పుస్తకాలూ చదివేను. భారతదేశ చరిత్రనుండీ యూరోపియన్ చరిత్ర వరకూ, కొంత ఇంగ్లీషులోనూ మరికొంత తెలుగులోనూ చదివేను. జాన్‌పాల్ సార్త్రేనుండి ఛేజ్ పుస్తకాలు వరకూ చాలా చదివేను. రోజూ హిందూ పేపరు పూర్తిగా చదువుతాను. అయినా మా బావకి డిగ్రీయే ప్రధానమయింది. బియ్యే ప్యాసయిన పెళ్ళామే కావాలిట. భార్య ఏం చదువుకుందని రేపు ఎవరయినా అడిగితే పియూసీ అని చెప్పటం తనకు ఎంతో నామోషీగా వుంటుందిట. అందుకే ముక్కుకు తాడు కట్టుకుని చదువుతున్నాను" అంది. ఇద్దరం కాఫీలు ముగించి బయటకు వచ్చేం.

నా చిరునామా ఆమెకు ఇచ్చేను. "ఎప్పుడయినా మా ఇంటికిరండి. మాశ్రీమతిని పరిచయం చేస్తాను" అని చెప్పేను. "అలాగే థేంక్యూ" అని చెప్పి వెళ్ళిపోయింది. అంతే ఆ తరువాత మళ్ళీ రెండు సంవత్సరాలు కృష్ణసుందరిని చూడలేదు. పరీక్షాసమయాల్లో కనబడకపోతే, 'చదువు ఆపేసి పెళ్లి చేసుకుందేమో' అని కూడా అనుకున్నాను.

మళ్ళీ మూడో సంవత్సరం పరీక్షలు రాయటానికి ఎ.వి.ఎస్. కాలేజీకి వెళ్ళినపుడు ఆమె కనిపించింది. చూడగానే నేను గుర్తుపట్టలేకపోయాను. కానీ ఆమె నవ్వుతూ నన్ను పలుకరించింది. "బాగున్నారా?" అంటూ. సమాధానంగా చిరునవ్వు నవ్వి "పరీక్షలకేనా" అంటూ అడిగేను. ఔనన్నట్లుగా తలవూపింది.

కృష్ణసుందరి మునపటికంటే లావెక్కింది. రెండేళ్ళ క్రితం నేను చూసిన చిలిపితనం, చలాకీతనం, ఒక రకమయిన నిర్లక్ష్యం పోయి ఏదో నిండుతనం ఆమెలో చోటు చేసుకున్నట్లు అనిపించింది. మనిషికాస్త నల్లబడింది. కనులవెనుక వెలుగులో జీవితాన్ని మరింత ఆకళింపు చేసుకున్న వెలుగు!

"సెకెండియరు పరీక్షలు భీమవరం సెంటర్‌లో మా అక్కయ్యగారింట్లో వుండి రాశాను." అంటూ నేను ఇంకా అడక్కుండానే కిందటి ఏడాది పరీక్షల్లో కనబడనందులకు సంజాయిషీ ఇచ్చింది.

"అన్నీ సబ్జెక్టులూ అయిపోయాయా?" అని అడిగేను

"ఆహా, అన్నీ పూర్తయిపోయాయి. హిస్టరీ వుండిపోతుందనుకున్నా. యూనివర్శిటీవారు దయతలచి కరక్టుగా పాస్‌మార్కులు ఇచ్చేరు. మీ గురించి అడగక్కరలేదు. అన్నీ క్లాసుమార్కులే వచ్చి వుంటాయి." అంది.

" మీ నమ్మకానికి కృతజ్ఞతలు అన్నీ ప్యాసయ్యాను."

"మీ నెంబరెంత? అంటూ అడిగింది. నా నెంబరు చెప్పేను.

"ఆల్ఫాబెటికల్ ఆర్డరులో ఇద్దరిపేర్లూ దగ్గరగావుండటం వలన నేను ఎంతో లాభం పొందుతున్నాను. ఈసారి కూడా మీ వెనుకనే నా సీటు. మీరు రాసిన ఎడిషనల్ షీట్లు నాకు అందించెయ్యండి. నేను కాపీ చేసుకుని మీకు ఇచ్చేస్తాను" అంది.

ఆమె ధైర్యానికి నా గుండె ఆగినంతపనయింది. 'ఇవ్వను' అని ఎలా చెప్పను? దొరికిపోయామంటే ఇద్దరం 'డిబార్' అయిపోతాం! ఆ మాటే బయటకు అన్నాను.

"ఏం ఫరవాలేదు. పట్టుబడితే మీ తప్పులేదని చెబుతాను. నేనే దొంగతనంగా మీ ఎడిషనల్ షీటు లాగేనని చెబుతాను. నేను డిబార్ అయిపోయినా పరవాలేదు. ఏదో విధంగా ఈ ఛాన్సులోనే బియ్యే కంప్లీట్ చేసి డిగ్రీ అందుకోవాలి. మా బావ ఈ ఏడాది ఎమ్మే ఫైనల్ రాస్తున్నాడు. ఇంగ్లీషు లిటరేచర్‌తో. రిజల్ట్సు వచ్చేశాక నాలుగయిదు

నెలల్లో మా పెళ్ళి చేసెయ్యాలనుకుంటున్నారు మా పెద్దవాళ్ళు" అంది.

ఈ పెళ్ళి చదువు వ్యవహారంచూస్తే నాకు నవ్వొచ్చింది.

"సెకండియర్ పరీక్షల్లో ఎవరు సాయం చేశారు?" నవ్వుతూ అడిగేను.

"నా వెనకా ముందూ నాలాంటి బ్రాజీమానాలే పడ్డారు. అందువల్ల దండిగా రోజూ స్లిప్పులు పట్టుకెళ్ళి పోయి రాసుకున్నాను. మీరొస్తారని తెలీదుకదా! అందుకని ఈ వేళా కొన్ని స్లిప్పులు తెచ్చేను." అంది.

నేను మరి మాట్లాడలేకపోయాను. అంతలో బెల్ అయింది. ఇద్దరం ఒకరికొకరు 'బెస్టాఫ్‌లక్' చెప్పుకుని పరీక్షాహాలులోనికి ప్రవేశించి మా సీట్లలో కూలబడ్డాం.

పరీక్షలు జరిగిన అన్నిరోజులూ నా ఎడిషనల్ షీట్లు నా దగ్గరనుండి ఆమెకు సరఫరా అయ్యేయి. మొదట నాలుగు రోజులూ ఎటువంటి అవరోధము లేకుండా ఆమె కాపీ చేయగల్గింది. షీటు అందించటానికి నాకే చేయివణికేదిగానీ ఆమె మాత్రం అదేదో తన హక్కుఅన్నట్లుగా తీసుకునేది. దర్జాగా ప్రక్కనే నా షీటు పెట్టుకుని కాపీ చేసేది. నేను పడుతున్న భయంలో వందోవంతుకూడా ఆమెలో కనిపించేదికాదు. ఆమె ధైర్యానికి జోహారనకుండా వుండలేక పోయాను.

అయితే దురదృష్టంకొద్దీ అయిదోరోజు మాత్రం ఆమె వాచరుకు దొరికిపోయింది. వాచర్ ఆమె దగ్గరకు వచ్చి "కాపీ కొడుతున్నారు కదూ" అంటూ అడిగేడు ఆమెను. ఆ మాటలు విని నాకు ఒంట్లో వణుకు ఆరంభమయింది. "అవును పొరపాటే ఇంకెప్పుడూ ఇలాంటి పని చెయ్యను ఈసారికి వదిలెయ్యండి మీరు డిబార్ చేశారనుకోండి నా పెళ్ళి ఆగిపోతుంది. ఆపైన మీదయ, నా ప్రాప్తం" అంది.

ఆ వాచరు కొంతసేపు ఆమెవంక జాలిగాచూసి "ఓకే, ఇంకెప్పుడూ చెయ్యకండి" అని నాదగ్గరగా వచ్చి "మిస్టర్ మీకు ఫస్టు వార్నింగ్ బీకేర్‌ఫుల్" అంటూ ముందుకు కదిలిపోయాడు. రేపటినుండి కాపీ రాయాల్సిన పని ఆమెకు లేదు. ఎందుకంటే ఆరోజు ఆఖరు పరీక్ష.

బయటకు వచ్చాక "ఈవేళతో పీడా వదిలిపోయింది.." సారీ! మీకు అనవసరంగా మాటవచ్చింది నామూలంగా... రియల్లీసారీ" ఎంతో నొచ్చుకుంటున్నట్లు అంది.

"వాచర్ చాలామంచి ఆయన. లేకపోతే ఇద్దరం డిబార్ అయివుండేవాళ్ళం" అన్నాను. ఆమె మాట్లాడలేదు. స్కూటర్ స్టార్ట్ చేస్తూ అన్నాను "మా ఇంటికి రమ్మని రెండేళ్ళ కిందటే ఆహ్వానించేను. కానీ మీరు రాలేదు. మీపెళ్ళికి కార్డు పంపండి నేను తప్పకుండా వస్తాను."

"సారీ నేను రాలేదని మరోలా అనుకోవద్దు. నా పెళ్ళికి కార్డు పంపుతాను

మీరు తప్పకరావాలి. వస్తామరి బై!" అంటూ బస్‌స్టాపువైపుకు కదిలిపోయింది.

యూనివర్శిటీలో బియ్యే ఫలితాలు బోర్డు కట్టారని తెలిసింది. నా రిజల్టు చూసుకోవాలని యూనివర్శిటీకి వెళ్తే అక్కడ కృష్ణసుందరి కనిపించింది. రిజిస్ట్రార్ ఆఫీసు మెట్ల దగ్గర ఆమె ఎవరితోనే మాట్లాడుతోంది. నన్ను చూసి "హలో ఫస్ట్‌క్లాసా" అంది.

"లేదు సెకండ్ క్లాసు" అని "మరి మీ సంగతి?" అంటూ అడిగేను.

"మీ పుణ్యమా అని పాసయ్యాను. థర్డుక్లాసు. చాల్లెండి. సబ్జెక్టులేవీ వుండిపోకుండా గట్టెక్కేశాను" అంది.

"కంగ్రాట్స్ మొత్తానికి సాధించేరు"

"అంతా మీ పుణ్యమే అని చెప్తున్నాకదా స్కూటర్ తేలేదా" అంది.

"లేదు ఓ స్నేహితుడు లిఫ్ట్ ఇస్తే మెయిన్‌గేటు దగ్గర దిగిపోయాను. పదండి బస్సుస్టాపు వరకూ నేనూ వస్తాను అక్కడ మిమ్మల్ని బస్సెక్కించి, నేను పిఠాపురం క్వార్టర్సుకు వెళ్లాను. ఓ ఫ్రెండ్‌ని కలవాలి" అన్నాను ఇద్దరం నడక సాగించేం.

నా ఉద్యోగం, భార్యాపిల్లలు మొదలయిన విషయాలగురించి ఏవేవో ప్రశ్నలు కురిపించింది కృష్ణసుందరి. తర్వాత "ఏమిటో మీ ఇంటికి రావటమే కుదరలేదు" అంది నొచ్చుకుంటున్నట్లు. ఆమె మాటల్లో మునుపటి హుషారు, నడకలో మునుపటి చలాకీతనం తగ్గినట్లు అనిపించింది.

"మరి పెళ్ళిభోజనం ఎప్పుడు పెడతారు?" అడిగేను. విరక్తిగా నవ్వింది కృష్ణసుందరి "నేను అప్పుడే పెళ్ళి చేసుకోవటంలేదు." అంది.

"కారణం ఏమయివుంటుందా? అని ఆలోచనల్లో పడ్డాను. కొంతసేపుపోయాక "మీ బావగారు ఒప్పుకోలేదా?" అంటూ చనువుగా అడిగేను.

"కాదు నేనే ఒప్పుకోలేదు మా బావని చేసుకోటానికి" అంది. అంతలో ఆమె ఎక్కవలసిన బస్సువచ్చింది. బస్సు ఎక్కే హడావుడిలో ఆమె ముందుకు గబగబా నడిచింది.

"ఎందుకని?" ఆత్రుతతో అడిగేను.

అంతలోనే ఆమె ఎక్కి లోపలకు వెళ్ళటం, బస్సు కదలటం జరిగిపోయింది. కదిలిపోతున్న బస్సు కిటికీలోంచి తల బయటకు పెట్టి "మా బావది ఎమ్మే పోయింది" అంది గట్టిగా.

బస్సు వెళ్ళిపోతున్న వంకే ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయాను. ★

(యువ మంత్లీ, దీపావళి సంచిక 1977)